చిలకలగూడ ఎస్‌హెచ్‌ఓగా అనుదీప్



చిలకలగూడ: చిలకలగూడ స్టేషన్ హౌస్ ఆఫీసర్(ఎస్‌హెచ్‌ఓ)గా అనుదీప్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. 2004 బ్యాచ్‌కు చెందిన అనుదీప్ అచ్చంపేట నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఉమ్మడి మెహబూబ్‌నగర్ జిల్లాలోని పలు ఠాణాల్లో ఎస్సైగా పనిచేశారు. 2017 నుంచి రాచకొండ కమిషనరేట్ పరిధిలో సీఐగా విధులు నిర్వహించారు. చిలకలగూడ సీఐ మట్టంరాజు సీసీఎస్‌కు బదిలీపై వెళ్లగా, మల్టీజోన్–2 కు చెందిన ప్రవీణ్‌ను చిలకలగూడ సీఐగా నియమిస్తూ ఆదేశాలు జారీ అయ్యాయి. అయితే, వ్యక్తిగత కారణాలతో ఆయన విధుల్లో చేరలేదు. కమ్యూనిటీ పోలీసింగ్, సీసీ కెమెరాల ఏర్పాటు, నేరాల నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని ఈ సందర్భంగా అనుదీప్ తెలిపారు.

పీజీలో 'జెనెటిక్స్, బయోటెక్నాలజీ' ప్రవేశపెట్టాలి

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీలలో ఎమ్మెస్సీలో జెనెటిక్స్, బయోటెక్నాలజీ కోర్సులు ప్రవేశపెట్టాలని తెలంగాణ రీసెర్చ్ స్కాలర్స్ అధ్యక్షుడు డాక్టర ప్రేమ్‌కుమార్ శుక్రవారం డిమాండ్ చేశారు. కరోనా సమయంలో వ్యాక్సినేషన్ తయారీ, పరిశోధనలకు ఈ రెండు కోర్సులు ఎంతగానో ఉపయోగయోగపడ్డాయన్నారు.

శ్రీగిరి ఆలయ పునర్నిర్మాణ పనులు భేష్

చిలకలగూడ: శ్రీనివాసనగర్‌లోని శ్రీగిరి ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణ పనులై అద్భుతంగా ఉన్నాయంటూ పుష్పగిరి శంకరాచార్య సంస్థాన పీఠాధిపతి అభినవోద్దండ విద్యా శంకరభారతి స్వామి కితాబిచ్చారు. రథ సప్తమిని పురస్కరించుకుని శుక్రవారం ఆలయంలోని బాలాలయంలో శంకరభారతి సూర్య నమస్కారాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రథసప్తమి విశిష్టతపై భక్తులకు అనుగ్రహభాషణం చేశారు. మరోవైపు రథ సప్తమి సందర్భంగా ఆలయంలో అరుణ పారాయణం, సూర్య నమస్కారాలతో పాటు పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ బసవరాజు శ్రీనివాస్, వైస్ చైర్మన్లు వేణుగోపాలరావు, లక్ష్మీనారాయణ, ఈఓ రాజేశ్ కుమార్, ఆలయ పునర్నిర్మాణ కమిటీ ప్రతినిధులు బాల భాస్కర్, ఆత్మరామ సూర్య సుబ్రహ్మణ్యం, శివ శంకరన్, నారాయణన్, సుజయ్ ప్రకాశ్, రామచందర్ పాల్గొన్నారు.



ఆలయ పునర్నిర్మాణ పనులు పరిశీలిస్తున్న శంకరభారతి స్వామి

'సెయింట్ ఫ్రాన్సిస్'లో వర్క్‌షాప్ ప్రారంభం



వర్క్‌షాప్‌లో పాల్గొన్న నెక్సెస్ సంస్థ ప్రతినిధి

సనత్‌నగర్: బేగంపేట సెయింట్ ఫ్రాన్సిస్ మహిళా కళాశాలలో కామర్స్ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం 'ఉద్యమిత 2.0–ఆఫ్ ద బీటెన్ ట్రాక్' పేరుతో నిర్వహించనున్న రెండు రోజుల వర్క్‌షాప్ ఉత్సాహంగా ప్రారంభమైంది. అమెరికన్ కార్నర్ సహకారంతో నిర్వహించే ఈ వర్క్‌షాప్‌లో విద్యార్థులకు అందుబాటులో ఉన్న అవకాశాలను అందిపుచ్చుకోవడం ఎలా అనే అంశంపై అవగాహన కల్పించారు. భవిష్యత్తును ఉజ్వలంగా తీర్చిదిద్దుకోవడంపై పలువురు వక్తలు మాట్లాడారు. అమెరికాకు చెందిన నెక్సెస్ సంస్థ ప్రతినిధి ఈడీ ఎరిక్ అజులె ముఖ్య అతిథిగా మాట్లాడారు. కార్యక్రమంలో యూనికార్పస్ హెల్త్ ఫౌండేషన్ సీఓఓ కవితా డేవిడ్, సామాజికవేత్త మేజర్ డాక్టర్ శివకిరణ్‌తో పాటు కళాశాల ప్రిన్సిపాల్ ఉమా జోసఫ్, ఎంటర్‌ప్రెన్యూర్ షిప్ కోహెర్ట్ సమన్వయకర్త విజయలక్ష్మి, మాస్ కమ్యూనికేషన్స్ అండ్ జర్నలిజం విభాగాధిపతి రవికుమార్, కామర్స్ విభాగం హెచ్‌ఓడీ దీపా శామ్యూల్ పాల్గొన్నారు.

సమ్మెకు సై

- ఆటోలన్నీ స్టాండ్‌లకే పరిమితం
- రోడెక్కిన వాహనాలను అడ్డుకున్న డ్రైవర్లు



ఆటోలను అడ్డుకుంటున్న ఆటో యూనియన్ నాయకులు, డ్రైవర్లు

అడ్డగుట్ట: దేశవ్యాప్త సమ్మె నేపథ్యంలో శుక్రవారం అడ్డగుట్టలో ఆటోలన్నీ స్టాండ్‌లకే పరిమితమైయ్యాయి. కొన్ని ఆటోలు ప్యాసింజర్లతో రోడ్లపై వెళ్తుండగా.. యూనియన్ నాయకులు అడ్డుకున్నారు. ఈక్రమంలో దేశవ్యాప్త సమ్మెలో అందరూ భాగస్వాములు కావాలని వారంతా డ్రైవర్లకు సూచించారు. దీంతో ఆటోల్లో ప్రయాణించే వారు ఇబ్బంది పడ్డారు. అడ్డగుట్ట, తుకారాంగేట్, పెట్రోల్ బంక్‌ల వద్ద ఇదే పరిస్థితి కనిపించింది.

బంద్ సంపూర్ణంగా పాటిస్తే..

దేశవ్యాప్త సమ్మె పాటించే ఆటో డ్రైవర్లు సంపూర్ణంగా బంద్ చేస్తే తమకు ఇబ్బందులు ఉండవని ప్యాసింజర్లు వాపోయారు. ఆటో డ్రైవర్లే బంద్‌ను సక్రమంగా పాటించకపోవడంపై వారంతా మండిపడ్డారు. బస్టాండుల్లో తమను ఆటో డ్రైవర్లే ఎక్కించుకుని రోడ్డు మధ్యలో వదిలేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు.

ఇబ్బందులు కలిగించకూడదు..

ప్రజలకు ఇబ్బందులు కలిగించకుండా ఆటో బంద్‌ను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని తుకారాంగేట్ సీఐ ఆంజనేయులు సూచించారు. ఆటో బంద్ నేపథ్యంలో అడ్డగుట్టలో రోడ్ల మధ్యలోనే ఆటోలను ఆపి ప్రయాణికులను ఇబ్బందులకు గురి చేస్తున్నారనే సమాచారంతో అడ్డగుట్ట, తుకారాంగేట్ ఆటో స్టాండ్‌ల వద్దకు సీఐ చేరుకున్నారు. అనంతరం, ఆటో యూనియన్ నాయకులు, ఆటో డ్రైవర్లతో మాట్లాడారు. ప్రయాణికులకు అసౌకర్యం కలిగించకుండా బంద్‌ను ప్రశాంతంగా నిర్వహించాలని సూచించారు.

దేశవ్యాప్త సమ్మెకు మద్దతు

అడ్డగుట్ట: కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా చేపట్టిన దేశవ్యాప్త సమ్మెకు ఇంటి పనివారల సంఘం పూర్తి మద్దతు ప్రకటిస్తుందని అడ్డగుట్ట ప్రజా సంఘాల నాయకులు తెలిపారు. ఈ మేరకు లోహియానగర్‌లో దేశవ్యాప్త సమ్మె పోస్టర్‌తో నిరసన తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ.. కార్మికులకు కనీస వేతనాలు, ఈఎస్‌ఐ, పీఎఫ్ ఇవ్వాలని, అదే విధంగా కనీస సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు అజయ్ బాబు, సికింద్రాబాద్ చేతి వృత్తుల సంఘం నాయకుడు ఎం.గోపాల్, బంధులాల్ తదితరులు పాల్గొన్నారు.

నూతన వాహన చట్టాన్ని సవరించాలి

లాలాపేట: దేశవ్యాప్త వాహన బంద్ సందర్భంగా శుక్రవారం లాలాపేటలోని విజయ డెయిరీ గేటు వద్ద డీసీఎం డ్రైవర్లు, హెల్పర్లు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నూతన వాహన చట్టాన్ని ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ నగర నాయకుడు అజయ్‌బాబు, అధ్యక్ష, కార్యదర్శులు బాల్‌రాజు, అమీద్ ఖాన్, కృపాకర్, అంజి, సాదిక్, మహేశ్, హరి, అభి, శంకరన్న ఉన్నారు.

సికింద్రాబాద్ డీసీగా సుభాశ్‌రావు

సికింద్రాబాద్: సికింద్రాబాద్ జీహెచ్‌ఎంసీ సర్కిల్ డిప్యూటీ కమిషనర్‌గా సుభాశ్‌రావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా భాగ్యనగర్ మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు ఆయనకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ జోనల్ ప్రెసిడెంట్ కొడారి రాజు, వైస్ ప్రెసిడెంట్ ప్రభాకర్, శంకర్, మధు, వెంకట్, వసంత్, లక్ష్మణ్, ఫారుక్, నర్సింగ్ రావు, సాయిరాం పాల్గొన్నారు.

ట్రాఫిక్ ఏసీపీగా శంకర్‌రాజు

రాంగోపాల్‌పేట్: ఉత్తర మండలం ట్రాఫిక్ ఏసీపీగా శంకర్‌రాజు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ట్రాఫిక్ ఏసీపీగా పనిచేస్తున్న మధుసూదన్ రెడ్డి చౌటుప్పల్‌కు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా శంకర్‌రాజు మాట్లాడుతూ.. ట్రాఫిక్ నియంత్రణలో ప్రజలు కూడా భాగస్వాములు కావాలని సూచించారు. ఈ సందర్భంగా పలువురు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

బేగంపేట డీసీగా సమ్మయ్య

సనత్‌నగర్: జీహెచ్‌ఎంసీ బేగంపేట డిప్యూటీ కమిషనర్‌గా సమ్మయ్య శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. తెల్లాపూర్ మున్సిపల్ కమిషనర్‌గా పనిచేసిన ఆయనను ఇక్కడికి బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ సందర్భంగా సర్కిల్ కార్యాలయ ఉద్యోగులు సమ్మయ్యకు శుభాకాంక్షలు తెలిపారు.

బీజేపీలో చేరిన 'మ్యాకల'

చిలకలగూడ: బీఆర్‌ఎస్ నాయకుడు, ఎంసీఆర్ ప్రజాసేవ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు చిలకలగూడ చింతబావికి చెందిన మ్యాకల చంద్రశేఖర్ బీజేపీలో చేరారు. సికింద్రాబాద్ మహంకాళి జిల్లా అధ్యక్షుడు శ్యామ్‌సుందర్‌గౌడ్ నేతృత్వంలో శుక్రవారం జరిగిన చేరిక కార్యక్రమంలో చంద్రశేఖర్‌కు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి కండువ కప్పి బీజేపీలోకి ఆహ్వానించారు. సికింద్రాబాద్ నియోజకవర్గంలో యువ నాయకత్వాన్ని మరింత ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని కిషన్‌రెడ్డి ఈ సందర్భంగా అన్నారు. అనంతరం చంద్రశేఖర్ మీడియాతో మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వం దేశానికి చాలా అవసరమన్నారు. పార్టీ పటిష్టతకు క్షేత్రస్థాయిలో తన వంతుగా కృషి చేస్తానన్నారు.


మద్యం మత్తులో ఆత్మహత్యాయత్నం

రాంగోపాల్‌పేట్: మద్యం మత్తులో ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన గోపాలపురం పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు.. బెంగళూరుకు చెందిన రాజు(42) 15 ఏళ్ల క్రితం నగరానికి వచ్చి క్యాటరింగ్ పనులు చేస్తూ ఫుట్‌పాత్‌పై నివసిస్తున్నాడు. శుక్రవారం మధ్యాహ్నం స్నేహితులతో కలిసి మద్యం తాగాడు. అనంతరం రెజిమెంటల్‌బజార్‌లోని గండిమైసమ్మ ఆలయం ప్రాంతానికి చేరుకొని బ్లేడుతో గొంతు కోసుకున్నాడు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించగా అక్కడికి చేరుకున్నారు. గాయాలపాలైన రాజును 108 సిబ్బంది గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఇదిలా ఉండగా, రాజు ఆత్మహత్యకు గల కారణాలు ఇంకా తెలియలేదని ఇన్‌స్పెక్టర్ నర్సింగ్‌రావు తెలిపారు.

చారిత్రాత్మక నిర్ణయం

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్ర అసెంబ్లీలో చేపట్టిన కుల గణన తీర్మానం చారిత్రాత్మకమని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ శుక్రవారం పేర్కొన్నారు. ఈమేరకు శాసనసభలో విద్య, బీసీ సంక్షేమ శాఖ ముఖ్యకార్యదర్శి బుర్ర వెంకటేశం కలసి స్వీట్లు పంచారు. బీసీల పక్షాన సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నల్గొండ బీసీ నేత పానుగంటి విజయ్, వరికుప్పల మధు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఫేర్‌వెల్ డే



సనత్‌నగర్: హిందూ పబ్లిక్ స్కూల్ ఫేర్‌వెల్ డే శుక్రవారం ఉత్సాహంగా జరిగింది. పదో తరగతి, 12వ తరగతి విద్యార్థులకు తొమ్మిది, 11వ తరగతి స్టూడెంట్స్ ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో స్వామి వివేకానంద సేవాసమితి ఎడ్యుకేషనల్ ట్రస్ట్ చైర్మన్ శ్యాంసుందర్‌గౌడ్, ట్రస్ట్ సభ్యుడు త్రిపాఠి, ప్రిన్సిపాల్ రాధిక తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఆయా తరగతుల విద్యార్థులకు హాల్ టికెట్లు పంపిణీ చేశారు.

వైద్య వృత్తిలో ఓర్పు అవసరం



నర్సింగ్ స్టాఫ్‌కు సూచనలిస్తున్న సూపరింటెండెంట్ రాజారావు

గాంధీఆస్పత్రి: ఓర్పుతో విధులు నిర్వహించి నిరుపేద రోగులకు మెరుగైన సేవలు అందించాలని గాంధీ ఆస్పత్రి సూపరింటెండెంట్ ప్రొఫెసర్ రాజారావు నర్సింగ్ సిబ్బందికి సూచించారు. ఇటీవల ప్రభుత్వ ఉద్యోగం సాధించిన 130 మంది నర్సింగ్ ఆఫీసర్లకు గాంధీ ఆస్పత్రిలో పోస్టింగ్ కేటాయించగా, వారంతా శుక్రవారం విధుల్లో చేరారు. గాంధీ చీఫ్ నర్సింగ్ ఆఫీసర్ మంగమ్మ నేతృత్వంలో సూపరింటెండెంట్ రాజారావును కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోగులకు వైద్యసేవలు అందించడం వరంగా భావించాలన్నారు. ఆస్పత్రికి వచ్చే నిరుపేద, నిరక్షరాస్యులైన రోగులకు అన్నివిధాల సహాయ, సహకారాలు అందించాలని సూచించారు. అనంతరం విధి నిర్వహణ, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సమయ పాలన తదితర అంశాలపై చర్చించారు. గాంధీ ఆస్పత్రిలో 153 రెగ్యులర్ నర్సింగ్ ఆఫీసర్ పోస్టులు ఖాళీ ఉండగా 130 పోస్టులు భర్తీ చేశారు. 365 మంది నర్సింగ్ ఆఫీసర్లు అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో విధులు నిర్వహిస్తుండగా, వారిలో సుమారు 125 మంది ఇటీవల ప్రభుత్వ ఉద్యోగం పొంది పలు జిల్లాలకు వెళ్లారు. కార్యక్రమంలో డిప్యూటీ మేరీ రోజ్‌లిన్, ఆర్‌ఎంఓ–1 జయకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వ తీర్మానంపై హర్షం



మాట్లాడుతున్న వంజరి సేవా సంఘం నాయకులు

లాలాపేట: రాష్ట్రంలో కుల గణన చేపట్టాలని అసెంబ్లీలో తీర్మానం చేయడంపై తెలంగాణ వంజరి సేవా సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు శుక్రవారం సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో నేతలు మాట్లాడారు. ఏళ్లుగా చేస్తున్న బీసీ కులాలు చేసిన విజ్ఞప్తులను గత ప్రభుత్వాలు పట్టించుకోలేదని చెప్పారు. సకల జనుల సర్వే ఫలితాలను సైతం గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం బహిర్గతం చేయలేదన్నారు. అయితే, ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం బీసీల కుల గణనకు శ్రీకారం చుట్టడం అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో అఖిల భారత వంజరి సేవా సంఘం జాతీయ సేనా ఉపాధ్యక్షుడు సాల్వేర్ కృష్ణ, తెలంగాణ వంజరి సేవా సంఘం అధ్యక్షుడు శంకర్ నారాయణ, ప్రధాన కార్యదర్శి దాత్రిక ధర్మరాజు, ఉద్యోగుల సంఘం నాయకులు కాలేరు సురేశ్, హరినాథ్, అంజయ్య, రామకృష్ణ, శ్రీనివాస్ తదితరులున్నారు.

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి

లాలాపేట: ప్రకాశం అధ్యయన సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం పలు ప్రభుత్వ పాఠశాలల్లో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులకు స్కూల్ బ్యాగులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంస్థ వైస్ చైర్మన్ డాక్టర్ పి.మోహన్‌రావు మాట్లాడుతూ.. దేశం అభివృద్ధి చెందాలంటే విద్యకు ప్రాధాన్యం ఇవ్వాలని, ఈ క్రమంలో ప్రభుత్వ విద్యా సంస్థలను బలోపేతం చేయాలని సూచించారు. ప్రభుత్వంతో పాటు దాతలు, ఇతర సంస్థలు ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రకాశం అధ్యయన సంస్థ ప్రధాన కార్యదర్శి రాములు, సహ కార్యదర్శి రాములు పాల్గొన్నారు.



స్కూల్ బ్యాగులు పంపిణీ చేస్తున్న ప్రతినిధులు

బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు ముందుకు రావాలి

రాంగోపాల్‌పేట్: బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రభుత్వంతో పాటు స్వచ్ఛంద సంస్థలు, సమాజం సమష్టిగా కృషి చేయాలని బాలల కమిషన్ చైర్మన్ శ్రీనివాసరావు అన్నారు. సికింద్రాబాద్‌లోని ఇన్‌క్రెడిబుల్ ఇండియా హోటల్‌లో ఇంటర్నేషనల్ లేబర్ ఆర్గనైజేషన్, తేరే దేశ్ హోం సంయుక్త ఆధ్వర్యంలో బాలకార్మిక నివారణ, నిర్మూలన భాగస్వామ్య ప్రయత్నాలు అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన శ్రీనివాసరావు మాట్లాడుతూ.. దేశంలో బాలకార్మిక వ్యవస్థ వేళ్లూనుకుందన్నారు. దీన్ని ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని సూచించారు. బిహార్, జార్ఖండ్, వెస్ట్ బెంగాల్, నేపాల్ లాంటి ప్రాంతాల నుంచి కొంత మంది బ్రోకర్లు 16–17 సంవత్సరాల పిల్లలను ఇక్కడకు తీసుకొచ్చి బాలకార్మికులుగా మారుస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో ఎస్‌సీపీసీఆర్టీ తెలంగాణ మెంబర్ బృందాధర్‌రావు, ఎస్‌పీసీజీ ఈపీఏసీ చైర్మన్ సంజయ్‌గుప్తా, టెక్నికల్ డైరెక్టర్ విక్రమ్ శ్రీవాస్తవ్, ఐఎల్‌ఓ నేషనల్ ప్రాజెక్టు డైరెక్టర్ రాజు లక్ష్మి నరసింహన్, టీడీహెచ్ ప్రతినిధి ప్రభాత్‌కుమార్ పాండే, శారద, శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

అడ్డగుట్ట: రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన లాలాగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం జరిగింది. ఎస్సై షాహీద్ పాషా తెలిపిన వివరాలు.. తార్నాకలోని సెయింట్ ఆన్స్ హైస్కూల్ వద్ద శుక్రవారం రాత్రి 9.30 గంటల సమయంలో సుమారు 40–45 సంవత్సరాల వయస్సు గల గుర్తు తెలియని వ్యక్తి రోడ్డు దాటుతున్నాడు. ఈక్రమంలో ప్రమాదవశాత్తు ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో పక్కనే ఉన్న డివైడర్‌కు తగిలి తీవ్రంగా గాయపడ్డాడు. సమాచారం అందుకున్న పోలీసు లు అక్కడికి చేరుకొని క్షతగాత్రుడిని గాంధీ ఆస్పత్రికి తరలించారు. కాగా, అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడి జేబులో ఉన్న సెల్‌ఫోన్ నంబర్‌కు పోలీసులు సమాచారం అందించారు.

పేద మహిళకు ఎల్‌ఓసీ అందజేత

సనత్‌నగర్: మోకాలి శస్త్ర చికిత్స కోసం ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న పేద మహిళకు మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అండగా నిలిచారు. రాంగోపాల్‌పేట డివిజన్‌లోని గైదన్‌బాగ్‌కు చెందిన నఫీజ్‌బేగం కొద్దికాలంగా మోకాలి నొప్పితో బాధపడుతోంది. ఆపరేషన్ కోసం ఆర్థికంగా ఇబ్బందులు ఉండటంతో మాజీ కార్పొరేటర్ అరుణ శ్రీనివాస్‌గౌడ్ సహకారంతో మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను కలిశారు. ఆయన చొరవతో సీఎంఆర్‌ఎఫ్ నుంచి రూ.90 వేలు మంజూరు కాగా శుక్రవారం వెస్ట్‌మారేడ్‌పల్లిలోని తన నివాసంలో బాధితురాలికి ఎల్‌ఓసీ అందజేశారు.



బాధితురాలికి ఎల్‌ఓసీ పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్


పద పదమని ఉద్యమ పథమున పరుగులు నేర్పిన కేసీఆర్
నర నరమున ప్రవహించే ధైర్యం కేసీఆర్
అడుగడుగున అణువణువణువున అభివృద్ధంటే కేసీఆర్
చెదరక వెనుదిరగక ఎదిగిన చరితే కేసీఆర్
HAPPY Y KCR SIR
తలసాని సాయికిరణ్ యాదవ్
సికింద్రాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గ ఇంచార్జి
మాన్యశ్రీ కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు గారికి
జన్మదిన శుభాకాంక్షలు